# మరుపురాని మతిమరుపు

-డాక్టర్ గుమ్మా సాంబశివరావు

**తె**ల్లవారుతోంది. మసకమసకగా కనిపిస్తున్న వాళ్లు కూడా స్పష్టంగా కనిపిస్తున్నారు. కూరగాయల వాళ్లు రాగయుక్తంగా తమ కూరలలిస్టు చదువుతున్నారు. పేపరు బోయ్ తన జబ్బ పుష్టితో సైకిల్‌మీద వెళుతూనే పేపర్లు పై అంతస్తులోకి విసురుతున్నాడు. పాలవాడు గేటు దగ్గర పాల ప్యాకెట్లు పెట్టి 'పాలండీ' అని కేక పెట్టి తన డ్యూటీ అయిపోయినట్లు వెళ్లిపోయాడు. వంటగదిలో ఏదో సర్దుతున్న ఇందిర ఆ కేక విని వెంటనే పాలప్యాకెట్లు తెచ్చి కిచెన్‌లో పెట్టింది. ఈ లోగా చంటిది 'అమ్మా' అని ఏడుస్తూ నిద్ర లేవటంతో తనకు నిద్రాభంగమై లేచాడు నాగేశ్వర్రావు. చంటిదాన్ని తిట్టుకుంటూ టైం చూశాడు. ఏడు గంటలు దాటింది. చంటిది ఏడవటమే మంచిదయిందని సంతోషించాడు. బాత్రూం వైపు శరీరాన్ని కదిలించాడు. ఇందిర వచ్చి చంటిదాన్ని మళ్లీ నిద్రపుచ్చి తన పని తాను చేసుకుంటున్నది.

ముఖం కడుక్కొన్న నాగేశ్వర్రావు ఏదో ఆలోచిస్తూ షేవింగ్ యజ్ఞం సాగిస్తున్నాడు. "ఏమండోయ్ ఎంత సేపు! ఇంకా షేవింగ్‌లోనే ఉన్నారా? ఇవాళ కాలేజీకి ఎనిమిది గంటలకే వెళ్లాలన్నారుగా! అదేనండి! ఏదో ఇన్విజిలేషన్ ఉందని చెప్పారుగా! అప్పుడే ఏడున్నర కావస్తున్నది" అంది ఇందిర వంటింట్లో ఏవో పనుల్లో సతమతమవుతూ.

"అవునూ! ఆ సంగతే మర్చిపొయ్యా! నువ్వు చెప్పే వరకు అసలు గుర్తులేదు. మామూలుగా పదింటికే వెళ్లాలి కదా! అనే ధ్యాసలో ఉన్నా" అన్నాడు మీసాలు కత్తిరించుకుంటూ.

ఇందిర స్కూల్లో టీచర్. నాగేశ్వర్రావు స్థానిక కాలేజీలో లెక్చరర్. వీరి అన్యోన్య దాంపత్యానికి ఫలితం ఇద్దరాడ పిల్లలు. పెళ్లయిన మూడేళ్లలో "చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం" అని అక్షరాల నమ్మిన వాళ్లు కావడం వల్ల అంతటితో సంతృప్తి పడ్డారు.

చిన్నతనంలోనే తల్లిదండ్రుల్ని పోగొట్టుకున్న వాడు కావటం వల్ల నాగేశ్వర్రావు ఎప్పుడూ ఏదో ఒకటి ఆలోచిస్తూ ఉంటాడు. అందుకే ఆయనకు కొంచెం మతిమరుపు. కొంచమేం ఖర్మ - ఒక్కోసారి అది తార స్థాయికి చేరుతుంది. ఆమతి మరుపు ఇందిరకు ఒక్కోసారి విసుగు పుట్టిస్తుంది. ఒక వంక స్కూలు - ఇంకో వంక ఇంట్లో పిల్లలు - మరోవంక శ్రీవారి మతిమరుపు ఆమె సహనాన్ని పరీక్షిస్తుంటాయి. అయితే నాగేశ్వర్రావు మంచివాడు కావటంతో సర్దుకు పోతున్నది.

షేవింగ్ పూర్తిచేసి స్నానం అయిందనిపించి త్వర త్వరగా టిఫిన్ లాగించి, ఆలస్యమైందనే తొందరలో ఇందిరకు చెప్పకుండానే బయలుదేరాడు. కొంతదూరం వెళ్లి హఠాత్తుగా వెనక్కి తిరిగాడు. ఇంట్లోకి వస్తున్నప్పుడు ఇందిర చూసింది. ఏంటండీ? ఎప్పుడెళ్లారు? ఇప్పు డొచ్చారు అన్నది" "ఆ ఏంలేదు. సిటీబస్‌కు చిల్లర తీసుకోవటం మర్చిపొయ్యా. కొంతదూరం వెళ్లాక గుర్తొచ్చింది. ఇంకా నయం బస్సెక్కిం తర్వాత గుర్తుకురాలేదు" అన్నాడు. తన జ్ఞాపకశక్తిని తానే అభినందించుకుంటూ. "ఆ గొప్పలేండి. త్వరగా వెళ్లండి. ఇంకా పావుగంట కూడా లేదు" అన్నది. నాగేశ్వర్రావు కరెక్టు టైంకి వస్తే వింతగానీ ఆలస్యమైతే ఎవరూ పట్టించుకోరు. ప్రిన్సిపాల్‌గారికి కూడా ఒక్కోసారి కోపం వస్తుంది. మంచి లెక్చరర్ కావడంతో చూసీచూడనట్లు, మందలించీ మందలించనట్లు ఉంటారు.

నాగేశ్వర్రావు బయల్దేర బోతుండగా ఇందిర " ఏమండీ చంటిదానికి హార్లిక్స్ అయిపోయింది. మధ్యాహ్నం వచ్చేటప్పుడు పట్టుకురండి. మర్చి పోకుండా అన్నది. 'మర్చిపోకుండా' అనేమాట విన్నప్పుడల్లా నాగేశ్వర్రావుకు చికాకు కలుగుతుంది. 'సర్లే' అన్నాడు ముభావంగా.

సాయంత్రం నాలుగున్నరకి ఇందిర స్కూల్ నుంచి వచ్చింది. నాగేశ్వరరావు పిల్లలతో ఏదో ఆడు కుంటున్నాడు. చంటిదానికి 'హార్లిక్స్' ఇవ్వటం కోసం కిచెన్

## ఓ రైతు కథ

**ఓ** రైతన్నా!
నీకు తింటానికి తిండి కరువు
ఉంటానికి లేదు తెరవు
గుండె నిండా బాధల బరువు
ఆత్మహత్యేనా సులువు?

-వి. శ్రీలక్ష్మి

లోకి వెళ్లింది. వెదికింది. ఎక్కడా కనపడ లేదు. డైనింగ్ టేబుల్ మీద పాలపీక ఒకటి వెక్కిరిస్తూ కనిపించింది. ఆమెకు పరిస్థితి అర్థమైంది. "ఏమండీ! నేను తెమ్మన్న దేమిటి! మీరు తెచ్చిందేంటి?" అన్నది విసుగ్గా. "అదేంటీ నేను వెళ్లేటప్పుడు పాలపీక తెమ్మని అంత గట్టిగా చెప్పావుగా" అన్నాడు తన తప్పేమి లేదన్నట్లు. "మీకు మతిమరుపుతోపాటు చెవుడు కూడా కలిసిందా ఏంటి?" అని విసుక్కుంది.

○ ○ ○

టీ తాగిం తర్వాత ఇందిరతో "బజార్లో నాక్కొంచెం పనుంది. టైం ఆరవుతుంది. అలావెళ్లొస్తా" అని బయట పడ్డాడు.

నాగేశ్వర్రావు వెళ్లిన కొద్ది సేపటికి కొంతమంది ట్యూషన్ స్టూడెంట్స్ వచ్చారు. ఏరోజు కారోజు మాస్టారు ఉన్నారో లేదో అనేది వాళ్లకు అనుమానమే. ఎప్పుడుంటరో, ఎప్పుడుండరో ఆయనకే తెలియదు. చెప్పిన టైంకి ఉండక పోయినా డబ్బులిచ్చినా ఇవ్వక పోయినా ఉన్న సమయంలో మాత్రం పాఠం బాగా చెబుతారు. నోట్సుబాగా ఇస్తారు. కాబట్టి వాళ్లు కూడా సర్దుకుపోతుంటారు. మాస్టారు ఉన్న వాతావరణం కనిపించలేదు. 'మాస్టారూ! మాస్టారూ!" అని పిలిచాడు. ఇందిరవచ్చింది. ఆమెకు పరిస్థితి అర్థమైంది. "ఏమండీ! మాస్టారు లేరా! మమ్మల్ని ఆరింటికి రమ్మన్నారు" అన్నారు. ఇందిరకు మతిపోయింది. "ఆరింటికి వీళ్లని రమ్మని బజార్లో పనుందని వెళ్లారా. ఇవాళ రాత్రికి ఈయన మతిపరుపు సంగతి తేల్చాలి" అనుకుంటూ వాళ్లకు ఏదో సర్దిచెప్పి పంపింది.

కొత్తగా అచ్చులో తనపేరు చూసుకున్నవాడు సంతోష పడ్డట్లుగా ఏదో ఆలోచిస్తూ సంతోషంతో సన్న ఈల వేస్తూ బజార్నుంచి వచ్చాడు. పిల్లలు ఏడుస్తుంటే వాళ్ల గొడవలో ఉంది ఇందిర. ఏదో ఘనకార్యం సాధించనట్లు వచ్చీరావటంతోనే 'కొంచెం 'టీ' పెట్ట వోయ్" అన్నాడు. టీ కాదు గదా! సలసలా కాగే నీళ్లు నెత్తిన గుమ్మరించాలన్నంత కోపం వచ్చింది ఇందిరకు. అయినా ఏం చేస్తుంది. పిల్లల్ని సముదాయించి 'టీ' ఇచ్చి స్టూడెంట్స్ సంగతి చెప్పింది. అంతే అవాక్కయి పొయ్యాడు. ఈ మతిమరుపు మానడం ఎలా?" అనే ఆలోచనలో పడ్డాడు.

○ ○ ○

ఒకరోజు ఎందుకో తొందరగా లేచాడు. పుస్తకాలు ముందేసుకుని కాలేజీలో పిల్లలకు చెప్పాల్సిన నోట్సు రాస్తున్నాడు. నాలుగైదు రోజుల్నించి రేపు చెబు తాననంటూ వాయిదా వేస్తున్నాడు. ఇవ్వాళ చెప్పకపోతే పిల్లలు గొడవ చేస్తారు అనుకొని నోట్సు రాయటంలో నిమగ్నమయ్యాడు.

స్కూలుకు వెళ్లాలనే తొందరలో ఇందిర వంట పనుల్ని శరవేగంతో చేస్తున్నది. ఈ సమయంలో పెద్ద పిల్ల 'యశోద' లేచింది. "డాడీ! డాడీ" అంటూ దగ్గరకు వచ్చింది. 'తల్లీ! నోట్సు రాస్తున్నాను. నా దగ్గరకు రావద్దు' అన్నాడు. ఆపిల్ల ఏడుస్తూ నాకు 'బ్రచ్, బ్రచ్' అంటున్నది. పిల్ల అవసరాన్ని అర్థం చేసుకున్నాడు. బ్రష్ కావాలంటున్నది కొంతపేస్టు వేసిస్తే దాని గొడవలో అది ఉంటుంది కదా అనుకొని లేచి వెళ్లి బ్రష్ మీద పేస్టు వేసిచ్చి తన పనిలో తానున్నాడు.

పిల్ల ఏడుపులంకించుకుంది. 'మమ్మీ, మమ్మీ' అంటూ ఏడుస్తుంది. ఇందిరకేమీ అర్థం కాలేదు. పిల్ల నోరు చూపిస్తున్నది. ఏడుపు ఆపడం లేదు. ఏదో అనుమానం వచ్చింది ఇందిరకు. "ఏమండీ! ఇలా రండీ! ఇది ఏడుస్తుంది. దీని బ్రష్మీద టూత్ పేస్ట్ వేశారా! లేకపోతే ఇంకేమైనా వేశారా?" అన్నది తనపనికి భంగం కలిగిందన్న విసుగుతో. అప్పుడర్థమయింది ఆయనకు. తాను వేసింది షేవింగ్ క్రీం గాని టూత్ పేస్టు కాదని" చెప్పాడు. ఇలాగైతే ఎలా అండి. పిల్లల విషయంలోనయినా జాగ్రత్తగా ఉండకపోతే ఎట్లా" అన్నది. ఇలాంటి సమయాల్లో ఆయన ఆయుధం ఒక్కటీ. మౌనం!

○ ○ ○

నాగేశ్వరరావుకి బ్రూస్‌లీ సినిమాలంటే ఇష్టం. అందుకే లీలామహల్‌లో వచ్చిన ఏ సినిమానీ మిస్సయ్యే వాడు కాదు. ఒకరోజు తన మిత్రులిద్దరితో 'సినిమాకి వెళదాం. టిక్కెట్లు తెప్పించాను. సాయంత్రం ఐదున్నరికి లీలామహల్‌కి రండి" అని చెప్పాడు. వాళ్లకు ఆయన మతిమరుపుసంగతి తెలుసు. ఎన్నో అనుభవాలున్నాయి. "ఏం బాబూ! మమ్మల్ని రమ్మని చెప్పి

## హరితం

వసంతం పెట్టింది
రంగు సంతకం!
పుడమి తల్లికది
బంగరు పతకం!!

–హరితశ్రీ

మేం వెర్రి ముఖాలు వేసుకుని చూస్తుంటే నువ్వు ఎగ్గొట్టి తర్వాత రోజు సారీ చెప్పటానికా!" అన్నారు. అబ్బే అదేంకాదు. "ఇవాళ తప్పకుండా వస్తా" అన్నాడు.

చెప్పిన సమయానికి సరిగ్గా వచ్చాడు. మిత్రులకు ఆశ్చర్యం. ఇది ఎనిమిదో వింత అన్నారు. ఇవ్వాళ భూకంపం వస్తుందేమో! అన్నారు. ఒక చిరునవ్వు విసిరాడు. ఆ నవ్వులో తన ఘనత చూసుకోమనే భావాలు వినిపిస్తున్నాయి. "రండి పిక్చర్ స్టార్ట్ కాబో తున్నది. ఫస్టులోనే మంచి ఫైట్స్ ఉన్నాయంట" అని తొందరపెట్టి బయలేర్దాడు. మిత్రులిద్దరూ అనుస రించారు. గేటు దగ్గరకు వెళ్లి జేబులో చెయ్యిపెట్టాడు. అంతే! కుడితిలో పడ్డ ఎలుకలా అయ్యాడు. చొక్కా జేబు, ప్యాంటు జేబులూ తడిమితడిమి చూస్తున్నాడు. మిత్రులకి అనుమానం వచ్చింది. అనుమానం ఏం ఖర్మ! అసలు విషయమే తెలిసిపోయింది. నాగేశ్వ రావుకి తన మీద తనకే కోపం వచ్చింది. "అప్పుడు గుర్తొచ్చింది. ఉదయం వేసుకున్న ప్యాంటు జేబులో ఆ టిక్కెట్లుంచి ఈ పూట ప్యాంటు మార్చిన సంగతి" చెప్పాడు.

"ఇది మాకు అలవాటేగా! ఇక పదనాయినా! ఇంకా ఏదయినా సినిమాకెళదాం. దీనికి టిక్కెట్లు తీసు కుందామంటే ఇప్పటికీ "హౌస్ ఫుల్ బోర్డు పెట్టాడు" అన్నారు మిత్రులు. సమయానికి వచ్చి ఫ్రెండ్స్‌ని ఆశ్చర్యపరచాలనుకున్న తనపై మతిమరుపు విజయం సాధించినందుకు తలవంచుకున్నాడు నాగేశ్వరరావు.

○ ○ ○

నాగేశ్వర్రావు పాఠం చెబుతున్నాడు. గొంతు పెగల డం లేదు. పిల్లలకు వింతగా ఉంది. నాలుగు గ్రామర్ పాయింట్లు బోర్డుమీద రాసి, రాయండి వీటికి సమాధా నాలు అని కీచు గొంతుతో అని వాటిని దిద్ది బయటకు వచ్చాడు. మధ్యాహ్నం లీవుపెట్టి ఇంటికి వెళ్లాలని లీవ్ రాశాడు. ఈలోపు కొలీగ్ ఒకాయన వచ్చి కొంతడబ్బు సర్దమని అడిగాడు. రెండు జీతాల వాడు కావడంతో నాగేశ్వర్రావుకు బ్యాంకు బ్యాలన్సు బాగానే ఉంటుంది. కొలీగ్ పదివేలడిగితే పరధ్యానంలో ఇరవై వేలు 'డ్రా' చేశాడు. 'ఎందుకైనా పనికొస్తాయిలే' అని డబ్బు తీసుకొని ఇంటికెళ్లాడు.

మధ్యాహ్నం పరధాన్యంలో ఉండి ఎక్కువ డబ్బు 'డ్రా' చేసిన సంగతి పడుకోబోయే ముందు ఇందిరకు చెప్పాడు. ఆయన మతిమరుపు ఆమెకు రోజు రోజుకూ విసుగు పుట్టిస్తున్నది. "ఎందుకు తెచ్చారండీ! ఒక వేళ పొరపాటున ఎక్కువ 'డ్రా' చేసినా మళ్లీ వెంటనే బ్యాంకులో వేసి రావచ్చుగదా! తగుదునమ్మా! అని వాటిని ఇంటికి తీసుకురావాలా? ఇలా ఎప్పుడుబడితే అప్పుడు అవసరం లేకపోయినా తీస్తే వాటిని దేనికో ఒకదానికి ఖర్చు పెడతాం. ఇలా ఖర్చుచేస్తే రేపు పిల్లల భవిష్యత్తేంటి? మీ మతిమరుపు రోజురోజుకి మరీ మితిమీరుతున్నది. ఎన్నిసార్లు చెప్పినా ఇంతే" అవసరం దొరికింది కదా అని క్లాసు తీసుకుంది. అలవాటు ప్రకారం బెల్లు మోగితేనే పాఠం. ఆపే టీచర్ బెల్లు కొట్టకపోయినా చంటిదాని ఏడుపుతో క్లాసు పూర్తి చేసింది. పది కావస్తుంది. పొద్దునే లేవాలి అంటూ పడుకోవటానికి సిద్ధమైంది.

ఇంటిముందు ఆటో ఆగినచప్పుడు. ఈ సమ యంలో ఎవరు వస్తారా? అని ఇద్దరూ ఆత్రుతతో చూశారు. ఆటోలోంచి ఇద్దరు వ్యక్తులు దిగారు. ఆటో ఆగే ఉంది. వచ్చిన వాళ్లలో ఒకరు ఆమె మేనమామ. మరొకరు ఆయన మిత్రులై ఉంటారనుకున్నారు. వాళ్లెందుకొచ్చారో అర్థం కాలేదు. అదీ రాత్రీవేళ. మేనమామ ఎందుకో దిగులుతో ఉన్నాడు. కాళ్లు కడుక్కురమ్మని చెప్పింది. ఆయన ఏం మాట్లాడలేదు. విషయం ఏమిటని అడిగింది. చెప్పాడు. ఆయన కూతురికి కడుపునొప్పి అంటే హాస్పటల్‌కు తెచ్చామని తీరా డాక్టర్ పరీక్షచేసి వెంటనే ఆపరేషన్ చెయ్యకపోతే ప్రమాదమని ఖర్చు 15 వేలవుతుందని, ముందుగా 10 వేలు కట్టాలని చెప్పినట్లు ఆమెతో అన్నాడు. " ఈ రాత్రిపూట ఈ పట్టణంలో మాకు కావాల్సిన వాళ్లు మీరు తప్పక ఎవరున్నారమ్మా! అయినా మీదగ్గర కూడా ఇప్పటికిప్పుడు అంత డబ్బు ఎలా ఉంటుందమ్మా! మీరు జీతాల మీద బతికేవాళ్లు గదా! అయినా ఆశ చావక వచ్చాం" అని దుఃఖాన్ని దిగమింగుతూ అన్నాడు. అప్పుడు నాగేశ్వరరావు తానేదో ఘనకార్యం చేసినట్లు ఇందిర వంక చూసి "ఇప్పుడేమంటావ్" అన్నట్లు కనుబొమ్మలు ఎగరేశాడు" అంతే! ఆ మతి మరుపు వాళ్ల జీవితంలో మరుపురాని మతిమరుపుగా నిలిచిపోయింది. ■

మెయిల్!

నీ గురించి గుండెల్లో / మొదలయ్యేయి మెయిళ్ళు!
ఇక వరుసగా ఇ-మెయిళ్ళు!!

-జి. విజయశ్రీ